క్లుప్తంగా

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవానికి ముస్తాబైన శివపార్వతులు

గుడుపల్లె: మండలంలో కాడేపల్లెలోని శ్రీ నాగదేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో ముస్తాబు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవానికి భక్తులు విశేషంగా తరలి వచ్చి మొక్కులు చెల్లించారు. రాత్రి ఆలయం ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అలరించిన సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపించిన బృందంతో చైర్మన్, ఈఓ తదితరులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన సంకీర్తనల కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన శ్రీ కీర్తన సంగీత అకాడమి, వేదగిరి సుహాసిని బృందం ఆలయంలో అమ్మవారి సంకీర్తనలు ఆలపించారు. వారికి తొలుత ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి స్వాగతం పలికారు. బోయకొండ గంగమ్మను దర్శించుకున్నారు. సంకీర్తనల అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను పాలక మండలి సభ్యురాలు భారతితో కలిసి చైర్మన్, ఈఓ అందజేసి సత్కరించారు.

జోరుగా దళిత నాయకుల ప్రచారం



నల్లగుట్లపల్లెలో ప్రచారం చేస్తున్న నాయకులు

పుంగనూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో లేకపోతే బడుగు బలహీన వర్గాలకు అంధకారమేనని దళిత నాయకులు, సర్పంచ్ ఆంజప్ప, రాజు, చెన్నరాయుడు, శంకరప్ప స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని ఏతూరు, నల్లగుట్లపల్లె , కొత్తపల్లె దళితవాడలలో వారు కరపత్ర ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే ఉమ్మడి పార్టీ అభ్యర్థులకు తగిన గుణపాఠం నేర్పాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నను రెండవసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమార్, బాలాజి, చంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకుందాం



ఓటు హక్కుపై వినియోగంపై అవగాహన కల్పిస్తున్న రఘునాథ్

పలమనేరు: ఓటు హక్కును వయోజనులైన ప్రతి ఒక్కరూ విధిగా వినియోగించుకోవాలని పలమనేరు పీఏసీఎస్ చైర్మన్ రఘునాథ్ కోరారు. ఆదివారం ఆయన పట్టణంలోని గొబ్బిళ్లకోటూరులో ఇంటింటింటికీ వెళ్లారు. ఓటర్ల జాబితాలోని పేర్లను చూపెట్టి అందరికీ ఓటు హక్కు విలువను వివరించారు.

కంచిబందార్లపల్లెలో భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

గుడుపల్లె: మండలంలోని కంచిబందార్లపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి అధ్యక్షులు క్రిష్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. భగవద్గీత సారాంశాన్ని ప్రజలకు చాటి చెబుతున్నట్టు క్రిష్ణ చెప్పారు. ప్రజల్లో భగవంతుని పట్ల భక్తి, ఆధ్యాత్మిక చింతన పెంచేందుకు భగవద్గీతతో ప్రచారం చేయడమే కాకుండా వాటిని ఉచితంగా ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చరణ్, క్రిష్ణప్ప, ఇందిర, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తోడుగా ఉంటా..గెలిపించండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

శాంతిపురం: కుప్పం ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నిత్యం స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. ఆదివారం ఆయన తన సతీమణి దుర్గతో కలిసి ప్రధాన రహదారిలో, బడుగుమాకుపల్లె వారపు సంతలో విస్తృత ప్రచారం చేశారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుప్పం ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. 2019 ఎన్నికల్లో తన తండ్రి దివంగత చంద్రమౌళి ఓటమి పాలైనా, తర్వాత ఆయన భౌతికంగా దూరమైనా, తమ కుటుంబం కుప్పంలోనే ఉంటూ స్థానిక ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. కరోనా విపత్తు సమయంలో నాయకులు, వలంటీర్ల ద్వారా ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు కోవిడ్ బారిన పడిన ఎందరికో ఆస్పత్రిలో సదుపాయలు అందేలా చేశామన్నారు. కానీ కుప్పం ప్రజల ఓట్లతో గెలిచిన వ్యక్తి అప్పుడు ఎక్కడ ఉన్నారో, జనాన్ని ఏమాత్రం పట్టించుకున్నారో గుర్తు చేసుకోవాలని కోరారు. తమ ప్రభుత్వ పాలనలో ఎలాంటి వివక్ష లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించేలా చూశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరుగులేని ఆధిక్యం ఇచ్చిన కుప్పం ఓటర్లు మరో మారు ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి తనను, ఎంపీగా రెడ్డెప్పను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.



కరపత్ర ప్రచారంతో ఓటర్లను అభ్యర్థిస్తున్న అందిస్తున్న వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

మావారిని గెలిపించరూ!

మరో వైపు భరత్ సతీమణి దుర్గ తన భర్తను గెలిపించాలని కోరుతూ జోరుగా కరపత్ర ప్రచారం చేశారు. విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న తాము కుప్పం ప్రజలు చంద్రమౌళిపై చూపిన ప్రేమకు కృతజ్ఞతగా ఇక్కడికి వచ్చామని చెప్పారు. భరత్‌ను గెలిపిస్తే కుప్పం ప్రజలు గెలిచినట్టేనన్నారు. చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కుప్పం ఎంపీపీ అశ్విని, శాంతిపురం, రామకుప్పం మండలాల జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసులు, నితిన్ రాఘవరెడ్డి, పార్టీ కన్వీనర్లు బుల్లెట్ దండపాణి, విజలాపురం బాబురెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు పెద్దన్న, చంగప్ప, కృష్ణమూర్తి, నాయకులు ఏవీ జయరాం, వినోద్, మురళి, జగదీష్, రాజప్ప, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తన భర్తను ఆశీర్వదించాలని కోరుతున్న భరత్ సతీమణి దుర్గ

ఎలక్షన్ 'టీ'

**చాయ్ చమక్కులే చూడరా బాయ్
కుప్పం రాజకీయమే వేడెక్కరోయ్**

అనే లెవెల్లో వేడిగా..వేడిగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ మసాలా టీ రెడీ చేశారు. ఆదివారం శాంతిపురం మెయిన్‌రోడ్డులో కరపత్ర ప్రచారం చేస్తూ వెళ్లిన భరత్ సల్లయ్యకు చెందిన టీ కొట్టు వద్ద కాసేపు ఆగారు. భరతన్నా! టీ తాగేసి పోదాం నా..అని కార్యకర్తలు కోరేసరికి సరేనన్నారు. సరాసరి స్టౌ మీద వేడిగా ఉన్న నీళ్లలోకి టీ పొడి వేసి మరిగించారు. కొన్ని యాలకులు తెప్పించి, వాటిని దంచి, అందులో వేశారు. ఆ తర్వాత పాలు పోసి, చక్కెర వేసి కొన్ని క్షణాలు మరిగించి దించారు. ఇక వడకట్టి, మసాలా టీ రెడీ చేశారు. న్నోవ్! భలే టేస్ట్‌గా ఉందన్నా..అని పార్టీ నాయకులు, కార్యకర్తలే కాకుండా అక్కడ గూడిగూడిన ప్రజలు కూడా తలా ఓ గ్లాసు టీ లాగించేశారు. తాను ఇంట్లో కూడా అప్పుడప్పుడూ టీ చేసి ఇస్తూంటానని ఆయన చెప్పడంతో నవ్వులు పూశాయి. టీ తాగిన ఉత్సాహంతో అందరూ ముందుకుసాగారు. వ్యాపారం బాగా జరిగింది..సల్లగుండయ్యా..అని సల్లయ్య కరపత్రం తీసుకుని ఆశీర్వదించారు. – శాంతిపురం



గెలుపు కోసం సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి విజయం కోసం పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రెడ్డివారిపల్లె, కంభంవారిపల్లె, చింతపర్తివారిపల్లె, పాలమంద, 79–ఏ చింతమాకులపల్లె, ఊటు పల్లె, చింతలవారిపల్లె, తాటిగుంటపాలెంలో 'మేము సిద్ధం..మా బూత్‌లు సిద్ధం' సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాల అమలుపై విస్తృత ప్రచారం చేయాలని, అధికశాతం పోలింగ్ నమోదయ్యేలా చూడాలని చెప్పారు. ప్రజల మధ్యే ఉంటూ విజయానికి పాటుపడాలన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటస్వామి, యూత్ కన్వీనర్ వినోద్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పుత్రాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీ లక్ష్యం



పులిచెర్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహిస్తున్న మోటార్ సైకిల్ ర్యాలీ

పులిచెర్ల(కల్లూరు): రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పలువురు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం కల్లూరులో భారీ బైక్ ర్యాలీ, ప్రచార యాత్ర నిర్వహించారు. బైక్ ర్యాలీని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ ప్రారంభించి మాట్లాడారు. పార్టీ తరఫున పుంగనూరు నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు నుంచి పోటీచేస్తున్న పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం పలు గ్రామాల్లో కల్లూరు నుంచి కుంటావారిపల్లె వరకు దాదాపు వెయ్యి వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, ముర్వత్ బాషా, ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, మండల యూత్ అధ్యక్షుడు ఫరూక్, నాగరాజప్రసాద్, రాయల్ మోహన్, పోకల చంద్ర, రాణెమ్మ, రెడ్డి అహమ్మద్, షుకూర్, చంద్రశేఖరరెడ్డి, గోవిందరెడ్డి, సంతోష్, రాజశేఖరరెడ్డి, ఆనంద, శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

● కేంద్ర బలగాల కవాతు



రామకుప్పం: మండలంలోని మిట్టపల్లె, రాజుపేట, చెల్దిగానిపల్లెలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించి, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఓటర్లకు ధైర్యం కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

ఘనంగా 'మట్టలాదివారం'

పుంగనూరు: క్రైస్తవులు మట్టలాదివారం పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ హట్టన్ మెమోరియల్ చర్చిలో పాస్టర్ రాఖేషనిమ్రోద్ ఆధ్వర్యంలో చిన్నారులు, క్రైస్తవులు ఈతమట్టల ముల్లుల కొసలకు రకరకాల పువ్వులు గుచ్చి, కీర్తనలు ఆలపిస్తూ చర్చి చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో మట్టలాదివారం పండుగ గురించి పాస్టర్ వాక్యసందేశమిచ్చారు. శిలువ వేయడానికి ఐదురోజుల ముందు యేరూషలేములో ప్రవేశించిన ఏసుక్రీస్తును రాజులకు రారాజుగా కీర్తిస్తూ ప్రజలు ఖర్జూరపు చెట్ల మట్టలు, ఆలివ్ ఆకులు మొదలైన వాటిని పరచి ఆయనకు ఘన స్వాగతం పలుకుతారని, దీనిని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా మట్టలాదివారం పండుగను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తదనంతరం మానవాళి పాపవిమోచనార్థం ఆయన శిలువ వేయబడ్డారని, ఆరోజు (శుక్రవారం) గుడ్‌ఫ్రైడేగా ఉపవాస దీక్షలతో ప్రార్థనలు చేయనున్నట్టు చెప్పారు. తిరిగి మూడవ రోజు ఆదివారం ఆయన పునరుత్థానం చెందిన రోజును ఈస్టర్ పండుగగా ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఏసుక్రీస్తు ప్రబోధించిన బాటలో క్రైస్తవులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో చర్చి కమిటీ పెద్దలు రవికుమార్, భరత్‌భూషణ్, సురేష్ క్రిష్టఫర్, భాస్కర్, జవహర్ జయకుమార్, హేమంత్, సుధాకర్, సత్యరాజు, చిట్టి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు: ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

పలమనేరులో..

పలమనేరు: మట్టలాదివారం పండుగను పట్టణంలోని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఈతమట్టలతో ర్యాలీ నిర్వహించారు. మట్టలాదివారం ప్రత్యేకత గురించి చర్చి పెద్దలు జైపాల్, స్లీవా రెడ్డి ప్రసంగించారు. పట్టణంలో క్రైస్తవులు పాల్గొన్నారు.



పలమనేరు: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పుంగనూరు: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పుంగనూరు: సీఎస్ఐ చర్చిలో ఈతమట్టలతో ప్రదక్షిణలు పాస్టర్ రాఖేష్ నిమ్రోద్, చిన్నారులు

విజయమే లక్ష్యం



బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- సైనికుల్లా పనిచేద్దాం
- ప్రభుత్వం చేసిన మేలును జనానికి చాటిచెప్పండి
- న్యాయానికి, అన్యాయానికి మధ్య జరిగే పోరాటమిది
- 'మేము సిద్ధం–మా బూత్ సిద్ధం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి పార్టీ జెండాను రెపరెపలాడించాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. మండలంలోని మండిపేట కోటూరు పంచాయతీలో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, బూత్ కమిటీలతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని తప్పకుండా గెలిపించుకోవాలన్నారు. గతంలో 600 హామీలిచ్చి జనాన్ని ఏమార్చిన చంద్రబాబు ఈ దఫా సూపర్‌సిక్స్ పేరిట మళ్లీ మోసం చేసేందుకు రెడీ అయ్యారని, ఈ ఎన్నికల్లో ఆయనకు జనం విశ్రాంతి ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేవలం తన స్వార్థం కోసం వస్తున్న వారు కావాలా? ఇచ్చిన హామీలను 99శాతం చేసిన వారు కావాలా? అనేది జనం ఇప్పటికే నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రంగన్న, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, ఆస్పత్రి కమిటీ అధ్యక్షులు చెంగారెడ్డి, సచివాలయాల కన్వీనర్ తిరుమల, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కురబ దేవర



భక్తుల తలపై టెంకాయలు కొడుతున్న కుల గురువు

గంగవరం: మండలంలోని దండపల్లె కురప్పల్లెలో ఆదివారం కురబ దేవరను ఘనంగా నిర్వహించారు. కురబ కులస్తుల ఆరాధ్యుడు భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గ్రామంలోని శివాలయంలో స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలో నుంచి కురబ కులస్తులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అలాగే గ్రామస్తుల ఆహ్వానం మేరకు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేగౌడను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం భక్తులు తలపై టెంకాయలు కొట్టించుకుని మొక్కులు చెల్లించారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున గ్రామస్తులు

బలిజలందరూ వైఎస్సార్‌సీపీ వైపే



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యూత్ అధ్యక్షుడు కిషోర్‌బాబు

- పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, రాజంపేట పార్లమెంటరీ యూత్ అధ్యక్షుడు కిషోర్‌బాబు

చౌడేపల్లె: బలిజ కులస్తులందరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకు మద్దతు ఇస్తున్నారని, వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలుపించుకోవడమే తమ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, రాజంపేట పార్లమెంటరీ యూత్ అధ్యక్షుడు, కాపు యువనేత మిద్దింటి కిషోర్‌బాబు తెలిపారు. ఆదివారం చౌడేపల్లెలో మిద్దింటి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో బలిజ కులస్తులతో కలిసి ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పరంగా ముందుకు తీసుకెళ్లి ఆదర్శంగా నిలిపారన్నారు. బలిజ కులస్తులకు వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం కల్పించి టీటీడీ బోర్డు మెంబర్, బోయకొండ చైర్మన్ పదవి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులతోపాటు పలు నామినేటెడ్ పోస్టులను పెద్దిరెడ్డి కట్టబెట్టారన్నారన్నారు. రాజకీయంగా వైఎస్సార్‌సీపీలో వారి వెంట నడిచి, ఇప్పుడు పదవులకు ఆశపడి, మరొక పార్టీలోకి వెళ్లిన వాళ్లు పెద్దిరెడ్డి కుటుంబం, మిథున్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదని మండిపడ్డారు. ఏ సమస్య వచ్చిన తామున్నాం అంటూ అందరినీ ఆదుకుంటున్న పెద్దిరెడ్డి కుటుంబం వైపు బలిజ కులస్తులందరూ నడుస్తామని, గ్రామస్థాయి నుంచి ప్రచారం చేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు. సమావేశంలో యూత్ జిల్లా కార్యదర్శి పగడాల రామ్మూర్తి, నేతలు రవి, సురేష్, మోహన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేద్దాం



సదుం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సదుం: క్షయవ్యాధి నిర్మూలనకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలని స్థానిక సీహెచ్‌సీ డాక్టర్ రూపానంద్ కోరారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం సదుంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు, పోషకాహారం వాడితే వ్యాధి నుంచి పూర్తిగా విముక్తి పొందవచ్చన్నారు. మండలంలోని వ్యాధి గ్రస్తులకు సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి ప్రతి నెలా పోషకాహార కిట్ ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. డాక్టర్ అన్నపూర్ణ, శ్రీనివాసులు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..



చౌడేపల్లెలో...

చౌడేపల్లె: డాట్ పద్ధతిలో మందులు వాడితే క్షయవ్యాధి(టిబి) వ్యాధి నుంచి సంపూర్ణ ఆరోగ్యవంతులు కావొచ్చని వైద్యాధికారి పూజ అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా చౌడేపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మూడు వారాలపాటు దగ్గు, సాయంత్రం పూట జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే క్షయగా అనుమానించి, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గల్ల పరీక్ష చేయించుకోవాలని కోరారు. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యుల సలహా మేరకు డాట్ పద్ధతిలో మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.